# వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం

- గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కమిటీలు
- పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు
- కార్యకర్తల సమావేశంలో సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్



సమావేశానికి హాజరైన కార్యకర్తలు



గ్రామ కమిటీల ఏర్పాటుపై మాట్లాడుతున్న సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

**బంగారుపాళెం:** గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలే బలమైన పునాదని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం బంగారుపాళెంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా నివాసంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి సూచనల మేరకు మండలంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ దిశగా ఆయా గ్రామాలలోనే సమావేశాలు నిర్వహించి, అన్ని వర్గాలకు చెందిన క్రియాశీలక యువతకు కమిటీలలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పార్టీ నాయకులు, కార్యకర్తల విషయంలో చేస్తున్న దౌర్జన్యాలు, అక్రమ కేసులకు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటూ భరోసా ఇస్తోందన్నారు. గ్రామ కమిటీల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కమిటీ ఎస్ఈసీ సభ్యురాలు లలితకుమారి మాట్లాడుతూ, పార్టీ అధినేత ఆశయాలను గ్రామస్థాయికి చేరవేయడంలో కమిటీలు కీలక పాత్ర పోషించాలని, 2029లో మళ్లీ తమ పార్టీ అధికారంలోకి వచ్చే దిశగా ఇప్పటి నుంచే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. అనంతరం కుమార్‌రాజా మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సర్దార్, జిల్లా పార్టీ కార్యదర్శులు గోవింద స్వామి, ప్రకాష్‌రెడ్డి, రఘు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయశంకర్, ఈడిగ, కురబ, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు ఎల్లప్ప, అమరనాథ్, మొగిలీశ్వర, కృష్ణమూర్తి, సోషల్ మీడియా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్‌రెడ్డి, నియోకవర్గ రైతు అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, మండల అధ్యక్షుడు అరుణామల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు కృపాసాగర్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కామరాజ్, కమలాపతిరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు వాణిప్రియ, ఎస్సీ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు నాగరాజ, షాకీర్, మండల యూత్ అధ్యక్షుడు గజేంద్ర, మహేంద్ర, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### లలితకుమారికి ఆత్మీయ సన్మానం



లలితకుమారిని సన్మానిస్తున్న సునీకుమార్, నాయకులు

**బంగారుపాళెం:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్ఈసీ) సభ్యురాలు నియమితులైన మాజీ ఎమ్మెల్యే లలితకుమారిని సోమవారం సాయంత్రం నాయకులు ఘనంగా సన్మానించారు. పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డితో పాటు పలువురు నాయకులు ఆమెకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. ఆమె మాట్లాడుతూ, పార్టీ అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## క్లుప్తంగా

### రెండు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'



మల్లకుంటలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

**తవణంపల్లె:** మండలంలోని మల్లకుంట, పుణ్య సముద్రం గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు రోగులకు బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులు, గర్భవతులు, జ్వరపీడితులకు వైద్య పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎంలు రేవతి, నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ నిఖిల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రజా ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ

మున్సిపల్ కమిషనర్ ఆదేశం



ప్రజల సమస్యలు వింటున్న సహాయ కమిషనర్ ప్రసాద్

**చిత్తూరు అర్బన్:** ప్రజావేదికలోవచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా రాహుకేతు పూజలు



మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు

**బంగారుపాళెం:** మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి మూలవరులకు ఉదయం అభిషేకాలు, పూజల అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ ప్రత్యేక పూజల్లో భక్తులు దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, సిబ్బంది, ప్రధాన అర్చకుడు రెడ్డెప్ప గురుకుల్, అర్చకుడు దండపాణి గురుకుల్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు పెద్ద బాలశిక్ష పుస్తకాల పంపిణీ



పెద్దబాలశిక్ష పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెద్దబాలశిక్ష పుస్తకంపై అవగాహన ముఖ్యమని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. సోమవారం స్థానిక గిరింపేట నగర పాలక ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు ఉచితంగా పెద్దబాలశిక్ష పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఈ పుస్తకంపై పట్టు పెంచుకోవాలని కోరారు. అనంతరం 500 మంది విద్యార్థులకు నీతి పద్యాల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మోహన్, సమితి కోశాధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ నూతన స్లాబులపై అవగాహన



ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

**చిత్తూరు కలెక్టరేట్ :** జీఎస్టీ నూతన స్లాబులపై డిగ్రీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి అన్నారు. జీఎస్టీ నూతన స్లాబులపై సోమవారం ఆ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ , విద్యార్థులు జీఎస్టీపై అవగాహన పెంచుకుని ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు హరిప్రసాద్, శరవణ, భానుప్రకాష్, తరణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నోటీస్ బోర్డు

- రేపు ఎక్సైజ్‌లో వాహనాల వేలం

**చిత్తూరు అర్బన్:** వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను 8వ తేదీ బహిరంగ వేలం వేయనున్నట్టు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీహరి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు కాంప్లెక్సు ఎదురుగా ఉన్న తమ స్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలవారు వాహనాలను ముందుగానే చూడవచ్చన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సీఎంసీ వైద్యులు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని సీఎంసీ వైద్యులు అన్నారు. చిత్తూరు మండలం తుమ్మిందలోని విజ్ఞానతేజ స్కూల్‌లో సోమవారం సీఎంసీ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 40 మంది వైద్యులు పరీక్షలు చేసి మాట్లాడారు. మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజని, నిర్వాహకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు

**తవణంపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు స్వామికి అభిషేకం అనంతరం గంధం, తమలపాకులు, తులసి మాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పలు రాష్ట్రాల భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

**భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం**

పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో ఉభయదారులతో వేదపండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. తొలుత కలశ స్థాపన చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

**ప్రాకారోత్సవం**

ఆలయ ఇన్‌చార్జి ఈఓ మునిశేఖర్ పర్యవేక్షణలో ఇదే రోజు రాత్రి అర్చకులు ఉత్సవమూర్తికి ప్రాకారోత్సవం నిర్వహించారు. పల్లకిలో కొలువుదీరిన స్వామి ఆలయం, సంజీవరాయ పుష్కరిణి చుట్టూ విహరించారు. భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

## పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

**ఐరాల:** కాణిపాకం పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ సాయినాథ్ వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐను నరసింహులును ఆదేశించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలన్నారు. తొలుత ఎస్ఐ, సిబ్బందితో కలిసి డీఎస్పీకి గౌరవవందనం చేశారు.

## ఆ లాయర్‌పై దేశద్రోహి కేసు పెట్టాలి

- కళ్లకు గంతలు కట్టుకుని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన

**చిత్తూరు కలెక్టరేట్ :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడ్డ లాయర్‌పై దేశద్రోహి కేసు పెట్టి బహిరంగంగా ఉరి తీయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ సంఘ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కఠినమైన శిక్షలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మురళి, సుశీలమ్మ, షణ్ముగం, సంతానం, పొన్నయ్య, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.




అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు

## నిండిన బంగారక్క చెరువు



చెరువుకు హారతి ఇస్తున్న గ్రామస్తులు



మొరవ పోతున్న బంగారక్క చెరువు

**గుడిపాల:** మండలంలోనే పెద్ద ఇరిగేషన్ చెరువుగా పేరున్న బంగారక్క చెరువు నిండి సోమవారం మొరవ పోయింది. దీంతో వసంతాపురం, బసవాపల్లె పంచాయతీ గ్రామస్తులు బంగారక్క గుడి వద్ద పూజలు, అభిషేకాలు చేశారు. 2021లో చెరువు మొరవ పోయిందని, ఆ తర్వాత ఇప్పుడు మొరవ పోవడం చాలా ఆనందంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చెరువుకు గ్రామస్తులందరూ హారతులు ఇచ్చారు.

## చోరీలపై అప్రమత్తం

**పలమనేరు:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని సీఐ మురళీమోహన్ తెలిపారు. ఈ మధ్య బస్టాండులో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం బస్టాండులో పర్యటించారు. ప్రయాణికులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ బస్సులు ఎక్కే సమయంలో విలువైన వస్తువులు వున్న బ్యాగులు, సెల్‌ఫోన్లు, పర్సులు తదితరాలను జాగ్రత్తగా వుంచుకోవాలని సూచించారు. బస్టాండు వద్ద అపరిచిత వ్యక్తులు చోరీలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా పిల్లలతో ఉన్న మహిళలు, ఒంటరి మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే బస్టాండులోని పోలీస్ హెల్ప్ డెస్క్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. బస్టాండులో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్చిస్తామన్నారు.

## నాలుగు నెలలుగా అందని వేతనాలు



ఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

**పలమనేరు:** నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వాపోయారు. వారు సోమవారం ఆర్‌ఎం సాయికిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో 16 మంది కార్మికులు పని చేస్తున్నట్టు తెలిపారు. సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, దీంతో కుటుంబాల పోషణ కష్టంగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. జీతాలు ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను అడిగితే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే తమకు అవసరమైన యూనిఫాం , చేతి తొడుగులు, షూలు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత గిరిధర్, లోకేష్, బుజ్జమ్మ, గీతా, లలిత, మధు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సదుం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మల్లీశ్వరి

**సదుం:** పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు. ఆమె సోమవారం జోగివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆకు కూరలు, చిరు ధాన్యాలు, గ్రుడ్లు, బెల్లం తదితరాల్లో మంచి పోషకాలు వుంటాయని తెలిపారు. పోషకాల లోపం వల్లే రక్తహీనత కలుగుతుందని వివరించారు.

## ఉర్దూ స్కూల్ డీఐగా సాబ్జూ సాహెబ్ బాధ్యతల స్వీకరణ



నూతన ఉర్దూ డీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉర్దూ టీచర్ల సంఘాల నాయకులు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా ఉర్దూ స్కూల్స్ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్)గా సాబ్జూ సాహెబ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం డీఈవో వరలక్ష్మి నుంచి ఉత్తర్వులు అందుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నూతన డీఐ మాట్లాడుతూ పలమనేరు ఉర్దూ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న తనకు ఉర్దూ డీఐగా అదనపు బాధ్యతలు అప్పగించారన్నారు. జిల్లాలోని ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతానని తెలిపారు. అనంతరం ఆయనను ఉర్దూ ఉపాధ్యాయ సంఘాలు రూటా, ఆపా, ఐటనాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

## పాఠశాలకు హాకీ స్టిక్స్ వితరణ



**పులిచెర్ల(కల్లూరు):** మండలంలోని ఎల్లంకివారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం కావేటిగారిపల్లెకు చెందిన ఉప్పు లోకనాథం సోమ వారం 8 గ్రాఫైట్ హాకీ స్టిక్స్, 12 టర్ఫ్ హాకీ బాల్స్ వితరణ చేశారు. ఆయనను హెచ్‌ఎం హరిశంకర్ అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పోకల తాతయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

**పుంగనూరు:** పిల్లలకు ద్విచక్రవాహనాలు, కార్లను ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. ఆమె సోమవారం పుంగనూరు పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. పలువురు పిల్లలు వాహనాలు నడుపుతుండడాన్ని గమనించారు. వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పిల్లలు వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పిల్లలు ఎక్కువగా వాహనాలు నడుపుతున్నారని, నిఘా పెట్టి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుని, పిల్లలకు వాహనాలను ఇవ్వరాదన్నారు.

# మా గోడు వినండయ్యా..!

- పీజీఆర్ఎస్‌లో వినతుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన ఉన్నతాధికారులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

**చిత్తూరు కలెక్టరేట్ :** ''అయ్యా..! ఎన్నోసార్లు వస్తూనే ఉన్నాం.. వినతులు ఇస్తూనే ఉన్నాం..ఇకనైనా మా సమస్యలు పరిష్కరించండయ్యా'' అని పలువురు అర్జీదారులు తమ గోడు నివేదించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఆర్‌ఓ మోహన్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

### దగా చేస్తున్న పౌల్ట్రీ కంపెనీలు



చాలా సంవత్సరాలుగా కోళ్ల పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్నాం. చాలా కంపెనీలు కోళ్లకు సరైన ధర ఇవ్వకుండా మోసం చేస్తున్నాయి. కిలో కోడికి ఇస్తున్న సొమ్ము ఏమాత్రం సరిపోవడం లేదు. అందుకే కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేయడానికి వచ్చాం. అధికారులు స్పందించి, కంపెనీల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాకు న్యాయం చేయాలి.

కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు,
పూతలపట్టు మండలం

### ట్రాన్స్‌కోలో కారుణ్య నియామకాలు ప్లీజ్!



కారుణ్య నియామకాలకు పూనుకోవాలని కోరుతున్న ట్రాన్స్‌కో శాఖ ఒప్పంద ఉద్యోగుల సంఘం నాయకులు.

విధి నిర్వహణలో మృతి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని ఏపీ విద్యుత్ ఒప్పంద ఉద్యోగుల సంఘం (3045) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సుధాకర్ కోరారు. కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ఉంటూ అకాల మరణం చెందుతున్న విద్యుత్ ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య నియామకాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

### రూ.15 వేలు పింఛన్ ఇప్పించదయ్యా



రూ.15 వేల పింఛన్ కోసం అధికారుల చుట్టూ ఎన్నోసార్లు తిరుగుతున్నా న్యాయం చేయడం లేదు. నాకు వెన్నెముక ఆపరేషన చేశారు. ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. దీనివల్ల జీవనాధారం లేకుండాపోయింది. రూ.15 వేల పింఛన్‌కు అర్జీలు ఎన్నోసార్లు ఇచ్చా. ఇకనైనా పింఛనుతో ఆదుకోండయ్యా. –చంద్రశేఖర్, 194 వెంకటాపురం, చిత్తూరు రూరల్

### నీటి సౌకర్యం కల్పించరూ!



మా ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వండి సారూ అని మండల అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. తిరిగి తిరిగి విసిగిపోయా. కూలీ పనులకు వెళ్లకుండా చిత్తూరుకు వచ్చి అర్జీ ఇవ్వడానికి వచ్చా. ఇకనైనా నీటి వసతి కల్పించండయ్యా.
–గోవిందమ్మ, రాగిమానుపెంట, బంగారుపాళెం మండలం